క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, అర్చకులు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై ధ్వజస్థంభానికి పూజలు నిర్వహించగా వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రతిష్ఠించారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలో సీసీ వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి ప్రధాన శిష్యుడు కిడాంబి నర్సింహ దేశికన్ ఆచార్యుల యాజ్ఞిక బృందం, ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఉత్సవ ఆర్థిక నిర్వాహకుడు జంగా జనార్ధన్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, నాచినపల్లి భజన మండలి బాధ్యులు బొమ్మినేని శ్రీనివాసరెడ్డి, నంగునూరి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ



పర్వతగిరి : మండల కేంద్రంలోని సీడ్స్, ఫర్టిలైజర్ షాపుల్లో మామునూరు ఏసీపీ ఎస్.వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. షాపుల అనుమతి, స్టాక్ బుక్కులు, ఇన్వాయిస్‌లు, రశీదులు, తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డీలర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని చెప్పారు. విత్తనాలను బ్లాక్ చేయొద్దన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలని కోరారు. తనిఖీల్లో సీఐ బి.రాజగోపాల్, ఎస్సై బి.ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు ప్రభుత్వ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మేరుగు రంజిత్, పట్ల కావ్య, ఆళ్ల గణేశ్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్టు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రమోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల శిక్షణ అనంతరం విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ముగ్గురు విద్యార్థులకు నెలకు వెయ్యి రూపాయలు చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేశ్, నరేందర్, జగన్, సమ్మయ్య, మదన కాశేశ్వర్‌రావు, సందీప్, తదితరులు అభినందిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట : పట్టణంలోని కార్ల్ మార్క్స్ కాలనీలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, వంగల రాగసుధ కోరారు. ఈ మేరకు వారు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకన్న, రాగసుధ మాట్లాడారు. కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉన్నట్టు తెలిపారు. వర్షాకాలంలో వరద ఇళ్లలోకి చేరుతోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, నాయకులు గజవెల్లి జగపతి, గణిపాక బిందు, ఆరిఫ్, జన్ను జమున, పద్మ తదితరులు పాల్గొన్నారు.

‘అర్హులకు దక్కని ఇందిరమ్మ ఇళ్లు’

పర్వతగిరి : మండలంలోని తురుకల సోమారంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కడం లేదని గ్రామానికి చెందిన నల్లం శివ, కోల రమేశ్, బొంతల రజిత, అన్వేశ్, చల్ల శేఖర్, వంగాల భరత్, పాషా తెలిపారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్ సత్యశారదకు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. కమీషన్లు తీసుకుని అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు.

కేసు నమోదు

వర్ధన్నపేట : ఈ ఏడాది ఏప్రిల్‌లో శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి హాజరైన తన పట్ల అవమానకరంగా ప్రవర్తించారని స్థానిక మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్వాహకులు సమ్మెట శ్రీనివాస్, నిర్వహణ కమిటీ సభ్యులపై కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. రాజకీయ కుట్రతోనే వేదిక మీదకు ఆహ్వానించలేదని, అధికారుల ముందు అవమానించారని శ్రీధర్ ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పాకాలవాగుపై బ్రిడ్జి నిర్మించేదెప్పుడో?

- వర్షాకాలంలో ఉధృతి
- రైతులకు తప్పని తిప్పలు


ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు (ఫైల్)

నర్సంపేట రూరల్ : పాకాల వాగులపై బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంతో ఏటా వర్షాకాలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడం పరిపాటిగా మారింది. వాగు ఉధృతంగా ప్రవహిస్తే వాగు అవతల ఉన్న పొలాలకు వెళ్లే రైతులు ఖానాపురం మండలంలోని అశోకనగర్ మీదుగా లేదా మనుబోతులగడ్డ నుంచి చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో పాకాల వాగుపై బ్రిడ్జి నిర్మించేదెప్పుడో..? అంటూ డివిజన్ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
నర్సంపేట డివిజన్‌లో అతిపెద్దది పాకాల చెరువు. ఈ చెరువు నుంచి ఖానాపురం, నర్సంపేట మీదుగా తుంగబంధం, పసుపునూరు, జాలుబంధం కాల్వలు పారుతున్నాయి. ఈ మూడు కాల్వల మధ్య నుంచి పాకాల వాగు పారుతూ మహబూబాబాద్ వరకు నీరు వెళ్తాయి. కాగా జాలుబంధం, పసుపునూరు, పాకాల వాగు, తుంగబంధం కాల్వల చుట్టు రైతులు వందలాది ఎకరాల్లో వరి సాగు చేస్తారు. వర్షకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడం సహజం. అంతేకాకుండా పాకాల చెరువు మత్తడి పోస్తుండడంతో వాగు దాటడం అసాధ్యం. దీంతో తుంగబంధం కాల్వ పరిసరాల్లో పంటలు పండించే రైతులు, వాగు అవతల పంటలు సాగు చేసే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. రైతులు పంటలను కాపాడుకోవాలంటే నర్సంపేట, సర్వాపురం, కమలాపురం గ్రామాల చుట్టు అశోక్‌నగర్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. పాకాల చెరువు మత్తడి పోస్తే నర్సంపేట–పాకాల ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోవడం తెలిసిందే. ఇక అలాంటి సందర్భాల్లో ఖానాపురం, మనుబోతులగడ్డ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. చుట్టూ 6–7 కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పాకాల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

పర్వతగిరి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ కోరారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని, అమలు చేస్తున్న పథకాలపై ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా మండలంలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. తొలుత పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతం గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు బత్తిని దేవేందర్, జాటోతు రవి, మండల ఉపాధ్యక్షులు తౌర్రి లక్ష్మణ్, యాకయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు గొల్లపల్లి సంతోశ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు బాదావత్ మారుతి నాయక్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గోన సంపత్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు చీమల చంద్ర, సీనియర్ నాయకులు గుడెల్లి ప్రభాకర్, భోగ సుధాకర్, నర్సయ్య, బొట్ల మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా రాజేందర్



రాయపర్తి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా ముత్యం రాజేందర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్సై శ్రవణ్‌కుమార్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు అటాచ్ చేయగా రాజేందర్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేందర్ మీడియాతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

ఖానాపురం : స్థానిక పురుషుల పొదుపు సంఘం నూతన కార్యవర్గాన్ని నర్సంపేట పురుషుల పొదుపు సంఘం సమితి అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి రమేశ్, ఉపాధ్యక్షుడిగా ఊరటి అనిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. తొలుత సమితి అధ్యక్షుడు చలిగంటి కొమురయ్య ఇటీవల మృతి చెందగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు నాగుల్ మీర, గుంటి అశోక్, మనోహర్, మహేందర్, కనకచారి, విక్రమ్, దేవ, ఇస్మాయిల్, గులాం నబీ, తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

సంగెం : తండ్రికి మందులు తీసుకురావడానికి వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన మండలంలోని లోహితలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండగా మే 17న మందుల కొనుగోలు కోసం వరంగల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెదికినా ఆచూకీ లభించలేదు. కాగా అదే నెల 25న హైదరాబాద్‌లో ఓ యువకుడితో బాలిక కనిపించినట్టు తెలిసి తల్లిదండ్రులు వెళ్లి అడిగితే మూడ్రోజుల క్రితమే బాలిక వెళ్లిపోయినట్టు చెప్పినట్టు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

- జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : బీజేపీతో తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్, పట్టణ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో కోకన్వీనర్ మల్యాల సాంబమూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ప్రతాప్‌రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ హయాంలో గడచిన 11 ఏళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. తొలుత పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పాదిల రాంచందర్, పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి సూత్రపు సరిత, కందికొండ శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మార్త సంధ్యారాణి, పట్టణ ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు, ఠాకూర్ విజయ్‌సింగ్, వరంగంటి రాజ్‌కుమార్, కార్యదర్శులు చేను నరేశ్, మాసు శివ, కందికొండ ప్రభాకర్, తప్పెట్ల సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటకు చెందిన డిగ్రీ విద్యార్థి దండు వంశీ తరుణ్ (22) శుక్రవారం తెల్లవారుజామున మామునూరు–తిమ్మాపూర్ నడుమ ద్విచక్ర వాహనం బోల్తా పడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వంశీ తరుణ్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో కాడెద్దు..

సంగెం : విద్యుదాఘాతానికి గురై కాడెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. గాంధీనగర్‌లోని న్యూట్రల్ లైన్ నెల రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు తెగిపడగా విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తెగి పడిన వైరును చుట్టి పక్కన చెట్లలో వేశారు. శుక్రవారం రైతు పొన్నర్సు చంద్రశేఖర్ అచ్చుతొలుతుండగా చెట్లపొదల్లో ఉన్న న్యూట్రల్ వైర్ కానికి, ఎద్దు మూతికి తగిలింది. రైతు గమనించక ముందుకు వెళ్లే సరికి తీగ బిగుసుకుని పైన ఉన్న విద్యుత్ పేజ్ వైరుకు తగలడంతో విద్యుత్ ప్రసరించి కాడెద్దు మృతి చెందింది. అచ్చుకు బిగించిన మేడి కర్రతో చేసింది కావడంతో రైతు ప్రాణాలతో బయటపడ్డాడు. పరిహారం చెల్లించాలని రైతు కోరాడు.

యూరియా వినియోగంతో భూమికి నష్టం


పర్వతగిరి : మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఓంప్రకాశ్


నెక్కొండ : మాట్లాడుతున్న శాస్త్రవేత్త హరి

- వ్యవసాయ శాస్త్రవేత్తలు ఓంప్రకాశ్, మాధవి

పర్వతగిరి : పంటల సాగులో యూరియా అధికంగా వినియోగిస్తే భూమికి నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.ఓంప్రకాశ్, బి.మాధవి తెలిపారు. మండలంలోని చింతనెక్కొండలో శుక్రవారం నిర్వహించిన ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. యూరియా, రసాయనాలను అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగం మేలని చెప్పారు. తద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. పంటల మార్పిడితో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని పత్తిపాకలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ హరి, డాక్టర్ మధు మాట్లాడారు. రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు. పంటలకు సాగునీరు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆధునిక ఆరుతడి పంటలు, కొత్త వంగడాలు, సాగు పద్ధతులపై వివరించారు. సమావేశంలో ఏఓ నాగరాజు, ఏఈఓ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : కరపత్రాలు ప్రదర్శిస్తున్న అధికారులు

రాయపర్తి : మండలంలోని గట్టికల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ విద్యాధర మాట్లాడారు. రైతులు పంటలకు సిఫారసు చేసిన మోతాదులో యూరియా బురదపదనులో వేయాలని సూచించారు. యూరియాను ఒకేసారి కాకుండా రెండు లేదా మూడు దఫాల్లో వేయాలన్నారు. యాసంగిలో వరి తర్వాత నూనె గింజలు, కూరగాయల సాగు చేపట్టాలని చెప్పారు. ఏటా పంట మార్పిడి చేస్తే భూసారం పెరుగుతుందని, చీడపీడల ఉధృతి తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అనూష, ఏఈఓ క్రాంతికుమార్, పంచాయతీ కార్యదర్శి సుమలత, ప్రిన్సిపాల్ నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆవుల తరలింపుపై కేసు


నల్లబెల్లి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆవులను గోవధకు తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మూడుచెక్కలపల్లికి చెందిన భూక్య జగన్ రెండు లేగదూడలను ముస్లింలకు విక్రయించడానికి తరలిస్తుండగా బీజేపీ నాయకులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మరో చోట 9 పశువులున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 11 పశువులను గోశాలకు తరలిస్తామని ఎస్సై చెప్పారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి


పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

వర్ధన్నపేట : ప్రభుత్వ పాఠశాలల గ్రంథాలయాల అభివృద్ధికి మేధావులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, యువత సహకరించాలని మండలంలోని ల్యాబర్తి ప్రభుత్వ హైస్కూల్ గ్రంథాలయ ఇన్‌చార్జ్, ఉపాధ్యాయుడు రెడ్డిమల్ల వెంకటస్వామి కోరారు. ఆ స్కూల్ గ్రంథాలయం కోసం ఉపాధ్యాయులు భూక్య హరిలాల్, జలగం రఘువీర్ సుమారు రూ.6 వేల విలువైన పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు (హెచ్‌ఎం) వేణుకుమార్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రంథాలయ ఇన్‌చార్జ్, ఉపాధ్యాయుడు వెంకటస్వామి మాట్లాడారు. పుస్తక దాతలను అభినందించారు. ఒక మంచి పుస్తకం 100 మంది స్నేహితులతో సమానమని చెప్పారు. గ్రామానికి చెందిన విద్యావేత్తలు, యువత వారి దగ్గర ఉండే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయానికి అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు మాధురి, నాగరాజు, శివకుమార్, ప్రభాకర్, అంగన్‌వాడీ టీచర్లు నీలమ్మ, కవిత, వీఏఓలు కవిత, విజయలక్ష్మి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం అందజేత


యూనిఫామ అందజేస్తున్న భాగ్యలక్ష్మి

నల్లబెల్లి: ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్ రెడీ అయ్యాయి. ఎంఆర్‌సీ లోఎం ఈఓ అనురాధతో కలిసి మదర్ తెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలకు శుక్రవారం యూనిఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడారు. స్కూళ్లు తెరుచుకున్న తొలిరోజే విద్యార్థులకు యూనిఫామ్ అందజేయాలని కోరారు. మహిళా సంఘాల ప్రతినిధులు సకాలంలో యూనిఫాం సిద్ధం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం సునీత, రేలకుంట, ఆసరవెల్లి స్కూళ్ల హెచ్‌ఎంలు శారద, భిక్షపతి, ఎంఆర్‌సీ సిబ్బంది రాజేశ్వరి, విజయ్‌కుమార్, ఆనందం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం


నర్సంపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని 1, 4, 14, 15, 17, 18 వార్డుల్లో పలు ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఆయన ముగ్గు పోయించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఒక్క గ్రామం కూడా లేదన్నారు. గడచిన పదేళ్ల బీఆర్‌ఎస్ ఒక్క ఇల్లు ఇచ్చిన మంజూరు చేయలేదన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, ఓబీసీ అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వర్ధన్నపేట : ముగ్గు పోస్తున్న వెంకటయ్య

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

వర్ధన్నపేట : అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య తెలిపారు. మండలంలోని కట్ర్యాల, ఇల్లంద గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యంతో కలిసి వెంకటయ్య ముగ్గు పోసి మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు సత్యం మాట్లాడుతూ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారి సతీశ్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం

- జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి


నల్లబెల్లి: దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ కృష్ణ

రాయపర్తి : భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని గట్టికల్, ఊకల్ గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులకు సంధ్యారాణి హాజరై మాట్లాడారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొంటున్న పట్టాదారు పాసు పుస్తకాల, ఇతర సమస్యల పరిష్కారం కోసం చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమాల్లో ఆర్‌ఐ కొయ్యడ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని గోవిందాపూర్, రేలకుంట గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముప్పు కృష్ణ పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. సాదాబైనామా, వారసత్వం, డిజిటల్ సంతకం పెండింగ్, లావాని పట్టా, తదితర సమస్యలపై దరఖాస్తులు అందించాలని రైతులకు సూచించారు.

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి, పానకల్ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి మాట్లాడారు. రైతుల దరఖాస్తులను క్రమ పద్ధతిలో పరిష్కరిస్తామన్నారు. భూభారతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు రాజేశ్వర్‌రావు, ఉమ, ఆర్‌ఐ రాంబాబు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే ఉత్తమ బోధన


వర్ధన్నపేట : బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

నర్సంపేట/నల్లబెల్లి/వర్ధన్నపేట/రాయపర్తి/నెక్కొండ/పర్వతగిరి : జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, వర్ధన్నపేట, రాయపర్తి, నెక్కొండ, పర్వతగిరి మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపర్తిలో వయోజన విద్య విభాగం ఉమ్మడి జిల్లా ప్రాజెక్టు అధికారి తుమ్మ రమేశ్‌రెడ్డి, నెక్కొండలో ఎంఈఓ, పర్వతగిరిలో స్థానిక స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాక రమేశ్ బాబు, పీఎం శ్రీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, వర్ధన్నపేటలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విజయ, నర్సంపేటలో ఎంపీపీఎస్ హెచ్‌ఎం నాగోతు శౌరీ, నల్లబెల్లిలో హెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన అందుతోందని చెప్పారు. అనేక వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులందరిపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. పిల్లలను చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకులు బోధిస్తారని, ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తోందని తెలిపారు. పేదలు ప్రభుత్వ స్కూళ్లు, విద్యాసంస్థల్లో పిల్లలను చేర్పి అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

నర్సంపేట : మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ తెలిపారు. పట్టణంలోని గ్రీన్ రిసార్ట్స్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి శిక్షణ తరగతులను భాస్కర్ అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతోన్మాదంతో అధికారాన్ని కాపాడుకుంటోందని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండగా పట్టించుకోకుండా ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని తెలిపారు. పాలక బూర్జువా ప్రభుత్వాల మోసపూరిత విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాలు నిర్మించాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తద్వారా పార్టీని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఈసంపెల్లి బాబు, నలిగంటి రత్నమాల, భూక్య సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి, నమిండ్ల స్వామి, హనుమకొండ శ్రీధర్, ఆరూరి కుమార్, ముంజాల సాయిలు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు

- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్


సర్టిఫికెట్ అందిస్తున్న ఉపేందర్, తదితరులు

నెక్కొండ : ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించొచ్చని తెలంగాణ నేత్ర, అవయవ దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్ తెలిపారు. మండలంలోని తోపనపల్లికి చెందిన యాకమ్మ (90) గురువారం మృతి చెందగా ఆమె నేత్రాలను బాధిత కుటుంబం సమ్మతితో టెక్నీషియన్ లక్ష్మణ్ ద్వారా సేకరించారు. అనంతరం బాధిత కుటుంబానికి నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడారు. నేత్ర, అవయవ, శరీర దానంపై ప్రజలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగల పద్మ, జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.